మహిళా దినోత్సవం

శబ్దంతో సమస్యను గుర్తించాను..



2024 అక్టోబర్ 30వ తేదీ రాత్రి 9 గంటలకు విధి నిర్వహణలో భాగంగా గూడ్స్ రైలు తనిఖీ చేస్తుండగా.. రైలు చక్రాల వద్ద ఏదో సమస్య ఉన్నట్లు గుర్తించాను. చక్రాల నుంచి వచ్చే శబ్దాన్ని బట్టి మంటలు వచ్చే అవకాశం ఉందని కనిపెట్టి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాను.. వెంటనే అధికారులు, సిబ్బంది వచ్చి పరిశీలించగా, చక్రాల వద్ద మంటలు ఏర్పడే పరిస్థితి ఉన్నట్లు నిర్ధారించారు. రైలు ముందుకెళ్తే తప్పనిసరిగా పడిపోయే అవకాశం ఉంది. నా సమయస్ఫూర్తితో ప్రమాదం తప్పడంతో జీఎం అవార్డు లభించింది.

--కె.అరుణ, ఎగ్జామినర్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే, విజయనగరం.

రెండింటినీ బ్యాలెన్స్ చేస్తున్నా...



ఓ వైపు కుటుంబం.. మరో వైపు ఉద్యోగం.. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వస్తున్నాను. కుటుంబాన్ని పోషించే భర్త దూరమవ్వడంతో 2015లో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. గూడ్స్ రైలుకి సంబంధించి సుమారు 53 బోగీలను ప్రతిరోజూ తనిఖీ చేయాలి. ఓ సారి విధి నిర్వహణలో ఉండగా రైలు యాక్సిల్ బాక్స్ నుంచి పొగలు రావడం గమనించారు. వెంటనే సమీపంలో ఉన్న అధికారులకు పరిస్థితి వివరించడంతో ప్రమాదం తప్పింది. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తుండడంతో 2023లో రైల్వే జీఎం అవార్డు వచ్చింది.

-జి.లక్ష్మి, అసిస్టెంట్, రైల్వే సి అండ్ డబ్ల్యు డిపార్ట్‌మెంట్, విజయనగరం

క్లుప్తంగా

12న ఆశీల వేలంపాట

పాలకొండ: నగర పంచాయతీలో ఆశీల వసుళ్లకు సంబంధించి ఈ నెల 12 బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ జయరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు కార్యాలయం ఆవరణలో వేలంపాట ఉంటుందని పేర్కొన్నారు. రోజువారీ మార్కెట్, సంతలు, పళ్ల బండ్లు, జంతువధ శాలలు, చెట్ల ఫలసాయం, తదితర రోజువారీ వసూళ్ల కోసం పాట పాడదలచిన వారు నేరుగా నగర పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

పక్కాగా పీ4 సర్వే నిర్వహించాలి



గరుగుబిల్లి: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

జియ్యమ్మవలస రూరల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వేను పక్కాగా చేయాలని ఎంపీడీవో ఎస్.రమేష్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్నిగ్రామ సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామీణులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు దోహదపడే ఈ సర్వేను సక్రమంగా చేయాలని, వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. సర్వేపై అపోహలు వద్దని, ప్రజలు కూడా సహకరించి, సరైన వివరాలు అందివ్వాలన్నారు.

గరుగుబిల్లి: పీ4 సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన.. పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా పీ4 సర్వే చేయడం జరుగుతోందని, ప్రజలంతా సర్వేకు సహకరించి వివరాలు ఇవ్వాలని కోరారు. శనివారం నుంచి సర్వే ప్రారంభించాలని తెలిపారు.

డ్రోన్లతో నిఘా



ఎర్రన్నగుడి వద్ద డ్రోన్ ఎగురవేస్తున్న డ్రోన్ ఆపరేటర్ దేముడుబాబు

గరుగుబిల్లి: బంగారం గొలుసు దొంగతనాలకు సంబంధించి నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు డ్రోన్లతో నిఘా పెట్టామని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద బంగారం గొలుసు దొంగతనం ఇటీవల జరిగిందన్నారు. దొంగ.. పల్సర్ బైక్‌పై ముఖానికి మాస్క్ పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై తిరుగాడుతున్న మహిళల మెడలోని బంగారు గొలుసుల చోరీకి పాల్పడుతున్నాడన్నారు. పనులకు వెళ్లే మహిళలు, బస్సు కోసం వేచి చూసే మహిళలు, బైక్ లిఫ్ట్ కోసం వేచి చూసే మహిళలు, యువతులంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. పేకాట, సారా శిబిరాల గూర్చి తెలిస్తే 100, 112 నంబర్లకు డయల్ చేసి సమాచారం తెలియజేయాలన్నారు.

ఏసుప్రభువుకు నిజమైన వారసులం..



క్రీస్తు సందేశం వివరిస్తున్న బిషప్‌లు

వీరఘట్టం: ప్రేమ, దయ, వాక్కులతో ఎంతో మందికి అద్భుత కార్యాలు చేసిన ఏసుక్రీస్తు ప్రభువుకు మనం నిజమైన వారసులమని శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయ్‌కుమార్ అన్నారు. మరియగిరి వేదికగా 26వ కతోలిక బైబిల్ మహాసభలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈనెల 9వ తేదీ వరకు జరగనున్న మహాసభలకు ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వందలాది మంది క్రైస్తవులు హాజరయ్యారు. వరంగల్‌కు చెందిన బిషప్ ఉడుముల బాల, హైదరాబాద్ బిషప్ పూల ఆంథోనీ, రాయిగఢ బిషప్ ఏ.సేనాపతి ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీస్తు సందేశాలను వివరించారు. పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికస్థితిగతులపై సర్వే

భామిని: ప్రతి కుటుంబం ఆర్థిక స్థితిగతులను సమీక్షించి యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె. కృష్ణారావు అధ్యక్షతన సచివాలయ సిబ్బందికి పీ-4 సర్వేపై శిక్షణ సదస్సు నిర్వహించారు. పేదరిక నిర్మూలనలో భాగంగా చేపడుతున్న సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖరనాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పక్క చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు చందక సుధీర్. వీరఘట్టం మెయిన్‌రోడ్డులో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. బుధవారం ఇతని షాపు ముందు ఉన్న మురుగు కాల్వపై నాలుగు సిమెంట్ పలకలను పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన కూలీలు తొలగించారు. కాల్వలో ఉన్న మురుగును తీసి రోడ్డుమీద వేశారు. అనంతరం తొలుత తీసిన నాలుగు సిమెంట్ పలకలను కాల్వపై అమర్చారు. ఈ పనికి గాను కూలీలు ఇతని వద్ద రూ.400 వసూలు చేశారు.



ఈ ఫొటోని వ్యక్తి పేరు శంకరరావు. వీరఘట్టం మెయిన్‌రోడ్డులో క్లినికల్ లేబరేటరీ నిర్వహిస్తున్నారు. ఈయన షాపు ముందు మురుగుకాల్వలో చెత్త తీసి పలకలు వేయడానికి కూలీలు రూ. 500 వసూలు చేశారు. ఇలా వీరి వద్దే కాదు.. మెయిన్ రోడ్డు ప్రధాన కాలువ పక్కనున్న దుకాణదారుల నుంచి కార్మికులు డబ్బులు వసూలు చేశారు. పారిశుధ్య పనులకు తమ వద్ద డబ్బులు డిమాండ్ చేయడంపై దుకాణదారులు మండిపడుతున్నారు.

పారిశుధ్య పనుల్లో చేతివాటం..

- ప్రజల డబ్బులతో పనులు
- ఇదీ వీరఘట్టం మేజర్ పంచాయతీ మెయిన్ రోడ్డులో చేపడుతున్న పారిశుధ్య పనుల తీరు

వీరఘట్టం:

కొద్ది రోజులుగా వీరఘట్టం మెయిన్‌రోడ్డులో చేపడుతున్న పారిశుధ్య పనులకు గాను పంచాయతీ అధికారులు స్థానికుల జేబులకు చిల్లులు పెడుతున్నారని వ్యాపారులు మండిపడుతున్నారు. ప్రజల సొమ్ముతో పారిశుధ్య పనులు చేయడం విడ్డూరంగా ఉందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. సుమారు ఏడాది కిందట రోడ్డు వేశారు. రోడ్డుకిరువైపులా కాలువలో ఉన్న మురుగు తొలగించకుండా కాల్వలపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేశారు. దీంతో కొంత కాలంగా కాలువలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వస్తోంది. ఈ వ్యవహారంపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు స్పందించి మురుగు తొలగింపు పనులు చేపట్టారు. అయితే కూలీలు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈఓ ఏమన్నారంటే..

పారిశుధ్య పనులకు డబ్బులు వసూలు చేస్తున్న విషయాన్ని పంచాయతీ ఈఓ ఎం.రవి వద్ద సాక్షి ప్రస్తావించగా కాల్వలపై సిమెంట్ పలకలు తీసి అందులో ఉన్న మురుగును మాత్రమే తమ సిబ్బంది తీస్తారని.. తీసిన సిమెంట్ పలకలను దుకాణదారులే అమర్చుకోవాలని తెలిపారు. ఇదిలా ఉంటే కార్మికులకు ఇలాంటి అవకాశం కల్పిస్తే భారీ అవినీతి జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



డబ్బులు తీసుకుని కాల్వలపై అమర్చిన సిమెంట్ పలకలు

భక్తిశ్రద్ధలతో సిరుల ఎల్లమ్మ జాతర



వీరఘట్టం : ఎల్లమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

వీరఘట్టం: సిరుల ఎల్లమ్మ, పోతన్న జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయినగర్ సమీపంలో వెలిసిన సిరుల ఎల్లమ్మ గుడికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ముందుగా ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ దంపతులు పూజలు చేశారు. అనంతరం మేజర్ పంచాయతీ ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శని, ఆదివారాల్లో కూడా జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జి.కళాధర్ బందోబస్తు నిర్వహించారు.



భామిని: ఎల్లమ్మ సన్నిధిలో భక్తులు

కిక్కిరిసిన భక్తులు...

భామిని: మండలంలోని నేరడి – బి గ్రామంలో వెలిసిన సిరుల ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు శుక్రవారం ఉదయం జోగి దండి, అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయంలో అరటి గెలలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పట్టణంలో ఆధ్యాత్మిక శోభ

పాలకొండ: పట్టణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. సిరుల పోతన్న వీధిలో ఉన్న ఎల్లమ్మ, పోతన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పాల జంగిడిలో పూజా సామగ్రి, ముడుపులు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.



పాలకొండ: పూజలు అందుకుంటున్న ఎల్లమ్మ పుట్ట

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం..



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని లివిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బౌరి త్రినాథ్ (55) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య సౌధామిని సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. పరామర్శలో ఎంపీటీసీ సభ్యురాలు పి.ఉషారాణి, మండల నాయకులు కొత్తకోట చంద్రశేఖర్, జామి ప్రభాకర్, గెల్లంకి రమేష్, కొత్తకోట ఆంజనేయులు, పతివాడ పగడాలమ్మ, తదితరులున్నారు.

పరామర్శ



అదినారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కళావతి, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బబ్బాది ఆదినారాయణ కుటుంబ సభ్యులను పాలకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం పరామర్శించారు. దోలమ సర్పంచ్‌గా, వైఎస్సార్‌సీపీ నాయకుడిగా సేవలు అందించిన ఆదినారాయణ అనారోగ్యంతో ఇటీవలే మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు మృతుని కుమారులు హరిబాబు, రాములకు ధైర్యం చెప్పారు. పరామర్శలో పైల వాసునాయుడు, సామంతుల సూర్యనారాయణ, బూరాడ సాంబమూర్తి, నెయగాపుల సత్యంనాయుడు, జనార్దనరావు, కృష్ణ, తదితరులున్నారు.

దుప్పట్ల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు గ్రామంలోని నిరుపేద గిరిజన మహిళలకు దుప్పట్లు, దోమతెరలు శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్ చేతులమీదుగా వాటిని అందజేశామని రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరామ్మూర్తి తెలిపారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న జనచేతన డైరెక్టర్ శశిభూషణ చౌదరి

సీతంపేట: జనచేతన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మజ్జి శంకరరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని గొయిదిలో ఆ సంస్థ డైరెక్టర్ శశిభూషణచౌదరి చేతుల మీదుగా వృద్ధులకు చీరలు, పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కట్లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి.సరోజిని, శేషు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్‌తో రైతుకు ప్రయోజనం



మణిగలో ఫారంపాండ్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యం, ఏపీఓ బాబూరావు

భామిని: వ్యవసాయ భూముల్లో ఫారంపాండ్స్ ఏర్పాటు చేసుకుంటే రైతుకు ఎన్నో ప్రయోజనాలుంటాయని ఎంపీడీఓ కొండపల్లి సత్యం అన్నారు. మండలంలోని మణిగ, రాతులగూడ, చీమలగూడ గ్రామాల్లో తీసిన ఫారంపాండ్స్‌ను ఉపాధి ఏపీఓ రేగిడి బాబూరావుతో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పెరగాలంటే ఇచ్చిన లక్ష్యాల మేరకు ఫారంపాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిశీలనలో టీఏ పొత్తక రాంబాబు, వేతనదారులున్నారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా జయరాం



జయరాంను అభినందిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

పాలకొండ: నగర పంచాయతీ కమిషనర్‌గా టి.జయరాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన కమిషనర్ సర్వేశ్వరరావు ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు సర్వేశ్వరరావును విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో నగర పంచాయతీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జయరాంనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జయరాంను చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు కలిసి అభినందనలు తెలియజేశార.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో సీతంపేట, భామిని, కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ప్రకృతి సేద్యంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఏయే విధానాలు అవలంబిస్తే ఆరోగ్యవంతమైన పంటలు, అధిక దిగుబడులు సాధించవచ్చన్న విషయాలను తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి ప్రకృతి సేద్యం తప్పనిసరి అని, రైతులంతా ప్రకృతి సాగు వైపు మరలాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్ సాగుకు అవసరమైన ప్రణాళికలు ముందస్తుంగా తయారు చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య శాఖలు, ఉపాధి హామీ పథకం, సెరీకల్చర్ తదితర శాఖల సమన్వయంతో ఖరీఫ్ సాగు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో విత్తన గుళికల తయారీకి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు జి.అన్నపూర్ణ, ఆర్.శ్రీనివాస్, సీహెచ్ శారద, మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గరుగుబిల్లి: స్థానిక శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి దశలో పదో తరగతి చాలా కీలకమని, విద్యార్థులంతా బాగా చదివి పరీక్షలు చక్కగా రాయాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తాగునీటి బోరుకు మరమ్మతులు..



వడమ ప్రాంత వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో స్థానిక కౌన్సిలర్ తూముల లక్ష్మణరావు స్పందించి నగరం పంచాయతీ సిబ్బందితో తాగునీటి బోరుకు శుక్రవారం మరమ్మతులు చేయించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - పాలకొండ రూరల్

వేధింపులను న్యాయపరంగా అధిగమిద్దాం..

- లీగల్ సర్వీసెస్ కమిటీ పాలకొండ మండల అధ్యక్షురాలు జ్యోత్స్న



పాలకొండ రూరల్: అవగాహన కల్పిస్తున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షురాలు జ్యోత్స్న

పాలకొండ రూరల్: ప్రత్యక్షంగా, పరోక్షంగా బాలికలపై జరుగుతున్న వేధింపులను న్యాయపరంగా అధిగమించవచ్చని పాలకొండ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షురాలు బి.జ్యోత్స్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో బాలికల కోసం రూపొందించిన పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన నాయ, చట్టపరమైన చర్యలపై వివరించారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ మాట్లాడుతూ.. మహిళల రక్షణకు పొందుపర్చబడిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై కె.ప్రయోగమూర్తి, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ కో ఆర్డినేటర్ బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

– ఘనంగా మహిళా దినోత్సవం

సీతంపేట: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీఓ రంగలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన 50 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, హెల్పర్లు, మహిళా పోలీసులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విస్సమ్మ, గౌరి, లావణ్య, బేగం, తదితరులు పాల్గొన్నారు.



భామిని: మహిళా టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

– మహిళా టీచర్లకు సన్మానం

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా టీచర్లను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధికరత దిశగా మహిళలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్స్‌పాల్ బాబూరావు, లెక్చరర్లు, టీచర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్

గుమ్మలక్ష్మీపురం: మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొత్తవలస గ్రామంలో ఆదివాసీ మహిళా వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు– సమాన హక్కులు అనే అంశంపై మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలను చూడాలని, అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించాలన్నారు. మహిళలపై చిన్నచూపు వద్దని, వారిని పని ప్రదేశంలో ఇబ్బందులకు గురిచేయొద్దని కోరారు. ప్రతీ మహిళ స్వయం ఉపాధి సాధించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం.శ్రీరాములు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.